## వస్త్ర పరిశ్రమను పునఃప్రారంభిస్తాం

రాజన్న సిరిసిల్ల, జనవరి 17 (నమస్తే తెలంగాణ): రెండు మూడు రోజుల్లో వస్త్ర పరిశ్రమను పునఃప్రారంభిస్తామని సిరిసిల్ల పాలిస్టర్ వస్త్ర ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు మండల సంత్యం తెలిపారు. బుధవారం సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం రూ.13కోట్ల విలువైన 69.50లక్షల మీటర్ల ఆర్వీఎం వస్త్ర తయారీ ఆర్డర్లు ఇచ్చినట్లు తెలిపారు. పాలిస్టర్ వస్త్ర నిలువలు పేరుకుపోయినందున పరిశ్రమ బంద్ చేశామని, ఇందులో ఎలాంటి రాజకీయ ప్రయోజనాలు లేవని స్పష్టంచేశారు. వాస్తవానికి ఆర్వీఎం ఆర్డర్లు నవంబర్, డిసెంబర్‌లో రావాల్సి ఉండగా ఆలస్యమైందన్నారు. పాలిస్టర్ వస్త్ర నిల్వలు పేరుకుపోయినప్పటికీ, కార్మికుల ఉపాధి దెబ్బతింటుందన్న ఉద్దేశంతో నడిపించినట్లు చెప్పారు. తయారైన వస్త్రాలకు గిట్టుబాటు లేకపోవడంతో పరిశ్రమ బంద్ పెట్టామన్నారు. బంద్ ప్రభావంతో మార్కెట్‌లో ప్రస్తుతం వస్త్రాలకు కొంచెం డిమాండ్ వచ్చిందని, రెండు మూడు రోజుల్లో పరిశ్రమను పునఃప్రారంభించనున్నట్లు తెలిపారు.

## నిరంతరం ఉపాధి కల్పించాలని ఆందోళన

టెక్స్‌టైల్ పార్క్‌లో ఆందోళన చేస్తున్న పవర్‌లూం వర్కర్స్ యూనియన్ కార్మికులు

సిరిసిల్ల రూరల్, జనవరి 17: పరిశ్రమలు బంద్ చేయకుండా, నిరంతరం నడిపిస్తూ తమకు ఉపాధి కల్పించాలని కోరుతూ తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లి శివారులోని టెక్స్‌టైల్‌పార్క్‌లో బుధవారం కార్మికులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేశ్ మాట్లాడుతూ, యజమానులు పరిశ్రమలను తరచూ బంద్ చేయకుండా, కార్మికుల సమక్షంలో చర్చలు జరుపాలని డిమాండ్ చేశారు. నిరంతరం కార్మికులకు ఉపాధి కల్పించే వారికి ప్రభుత్వ ఆర్డర్లు కేటాయించే విధంగా నిర్ణయం తీసుకోవాలని కోరారు. టెక్స్‌టైల్‌పార్క్‌లో ఖాళీగా, అసంపూర్తిగా ఉన్న షెడ్లను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని, వేరే వారికి కేటాయించాలన్నారు. ఆర్వీఎం వస్త్రానికి సంబంధించి పవర్‌లూం కార్మికులు, అనుబంధ రంగాల కార్మికులకు ప్రయోజనం కలిగేలా కూలి నిర్ణయించి అమలు చేయాలన్నారు. అనంతరం సీఐటీయూ, పవర్‌లూం వర్కర్ యూనియన్ ఆధ్వర్యంలో టెక్స్‌టైల్ ఏడీ అశోక్‌రావుకు వినతి పత్రం అందజేశారు.

## వ్యాపారంలో భాగస్వామ్యం ఇవ్వకుండా వేధింపులు

వేములవాడ, జనవరి 17: వ్యాపారంలో భాగస్వామ్యం ఇస్తానని కోటి రూపాయలు తీసుకొని మోసం చేశాడని ఓ వ్యాపారి ఆత్మహత్యాయత్నం చేశారు. వేములవాడలోని ఓ సినిమా హాల్ ఎదుట ఒంటిపై కిరోసిన్ పోసుకొని నిప్పంటించుకొనేందుకు యత్నించడం కలకలం రేపింది. వివరాలు..వేములవాడకు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త గంప మారుతి వ్యాపారంలో భాగస్వామ్యం ఇస్తానని సిరిసిల్లకు చెందిన పట్టాభి వెంకటేశం వద్ద ఏడాది క్రితం కోటి రూపాయలు తీసుకొన్నాడు. అయితే భాగస్వామ్యం ఇవ్వకపోగా చెల్లని చెక్కులు ఇచ్చి సతాయిస్తున్నాడని వెంకటేశం ఆరోపించారు. డబ్బుల కోసం ఎన్నిసార్లు అడిగినా సమాధానం దాటవేస్తున్నాడు. దీంతో మనస్తాపానికి గురైన వెంకటేశం కుటుంబసభ్యులతో కలిసి వేములవాడలోని మారుతికి చెందిన సినిమా టాకీస్ వద్దకు చేరుకొని ఒంటిపై కిరోసిన్ పోసుకొని ఆత్మహత్యాయత్నం చేశారు. అయితే అక్కడే ఉన్నవారు అడ్డుకున్నారు. మారుతిపై చట్టపరమైన చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయాలని వెంకటేశం కుటుంబీకులు కోరారు. ఈ విషయమై వేములవాడ టౌన్ సీఐ కరుణాకర్‌ను సంప్రదించగా ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

## ఎములాడ రాజన్నకు రూ.2.52కోట్ల ఆదాయం

- 21రోజుల్లో రికార్డు స్థాయిలో రాక

వేములవాడ టౌన్, జనవరి 17: వేములవాడ రాజన్న ఆలయానికి రికార్డు స్థాయిలో హుండీ ఆదాయం సమకూరింది. రూ.2 కోట్ల 52 లక్షల 29 వేల 580 సమకూరినట్లు ఆలయ ఈవో కృష్ణప్రసాద్ వెల్లడించారు. బుధవారం రాజన్న ఆలయ ఓపెన్‌స్లాబ్‌పై నిర్వహించిన లెక్కింపులో పై మొత్తంతోపాటు 277 గ్రాముల 100 మిల్లీగ్రాముల బంగారం, 13 కిలోల 280 గ్రాముల వెండి సమకూరిందని, ఇది 21 రోజులది మాత్రమేనని వెల్లడించారు.

# 'సీఎంఆర్' లక్ష్యాన్ని పూర్తి చేయాలి

- పెండింగ్ రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలి
- వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ అనురాగ్ జయంతి

డోర్స్ కార్యవర్గాన్ని అభినందిస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

కలెక్టరేట్, జనవరి 17: సీఎంఆర్(కస్టమ్ మిల్లుడ్ రైస్) డెలివరీ లక్ష్యాన్ని పదిహేను రోజుల్లోగా పూర్తి చేయాలని తహసీల్దార్లను కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. సీఎంఆర్ డెలివరీ వేగవంతం, భూ సంబంధిత ఫిర్యాదుల పరిష్కారం, ఓటు నమోదు దరఖాస్తుల పరిష్కారం సహా పలు అంశాలపై బుధవారం ఆర్డీవోలు, తహసీల్దార్లకు కలెక్టర్ ఐడీవోసీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా దిశానిర్దేశం చేశారు. ప్రతి రోజూ అన్ని రైస్ మిల్లులు పనిచేసేలా మానిటర్ చేయాలని సూచించారు. ప్రత్యేక దృష్టి పెట్టి లక్ష్యాన్ని చేరుకోవాలని ఆదేశించారు. అనంతరం ధరణి, ఇతర భూ సంబంధిత సమస్యలపై సమీక్షించారు. హైకోర్టు, ఇతర ఉన్నత న్యాయ స్థానాల్లోని పెండింగ్ కేసుల పరిష్కారంపై శ్రద్ధ పెట్టాలన్నారు. కోర్టు ఆర్డర్ ప్రకారం అర్జీలను పరిష్కరించాలన్నారు. భూ సంబంధిత ఫిర్యాదులను వారం రోజుల్లోగా పరిష్కరించాలన్నారు. అలాగే మీసేవ సర్వీసెస్ పెండింగ్‌పై సమీక్ష నిర్వహించారు. కుల, ఆదాయ, తదితర సర్టిఫికెట్లు పెండింగ్ లేకుండా చూడాలన్నారు. పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా ఫా రం-6,7,8 దరఖాస్తుల పరిష్కారంపై దృష్టి పెట్టాలన్నారు. ఓటరు జాబితాలో డబుల్, డూప్లికేట్, డెత్ ఓటర్లు లే కుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జనవరి 1, 2024 నాటికి 18 ఏళ్లు నిండిన విద్యార్థుల వివరాలను సేకరించి, ఎవరైనా ఓటు హక్కు నమోదు చేసుకోకుంటే వారు వెంటనే నమోదు చేసుకునేలా చూడాలన్నారు. శనివారం సాయంత్రం వరకు ఏ మండలాల్లో అతి ఎక్కువ ధరణి పెండింగ్ అర్జీలు ఉంటే సంబంధిత టాప్ 3 మండలాల తహసీల్దార్లు సోమవారం కలెక్టరేట్‌కు వచ్చి క్లియర్ చేయాలని ఆదేశించారు. అలాగే నాబార్డు సౌజన్యంతో చేపట్టే జీవనోపాధుల అభివృద్ధి, నైపుణ్య శిక్షణ కార్యక్రమాలపై నాబార్డు, గ్రామీణ అభివృద్ధి సంస్థ అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. శిక్షణకు ఆసక్తి చూపే నిరుద్యోగ యువత, స్వయం సహాయక సంఘాలను గుర్తించేందుకు జిల్లాలోని అన్ని ఆర్ అండ్‌ఆర్ కాలనీల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించారు. శిక్షణతోపాటు ఇంటర్న్‌షిప్ సర్టిఫికెట్, స్టైఫండ్, వసతి సౌకర్యం కూడా ఉంటుందన్న విషయాన్ని యువతకు, స్వయం సహాయక సంఘాలకు తెలియజేయాలన్నారు. శిక్షణ పొందిన తర్వాత ఉమ్మడిగా సంఘాలు లేదా అభ్యర్థులు రూరల్ మార్ట్ పేరుతో యూనిట్లు పెట్టుకుంటే నాబార్డు రూ.5 లక్షల వరకు ఆర్థిక సాయం అందజేస్తుందన్నారు.

### డోర్స్ కార్యవర్గానికి కలెక్టర్ అభినందన

కలెక్టర్ అనురాగ్ జయంతి, అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్‌ను డోర్స్ నూతన కార్యవర్గం సభ్యులు బుధవారం కలెక్టరేట్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. తమ ఎంపికను కలెక్టర్‌కు తెలియజేశారు. రాజన్నసిరిసిల్ల జిల్లా అధికారుల అసోసియేషన్(DOARS) నూతన కార్యవర్గ సభ్యుల ఎంపిక ఇటీవలే జరిగింది. డోర్స్ ఫౌండర్ చైర్మన్‌గా అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ ఉండగా, అధ్యక్షుడిగా జిల్లా రవాణా అధికారి కొండల్‌రావు, జనరల్ సెక్రటరీగా వినోద్‌కుమార్, కోశాధికారిగా శ్రీనివాసాచారి, ప్రచార కార్యదర్శిగా మామిండ్ల దశరథం ఎంపికయ్యారు. ఈ సందర్భంగా డోర్స్ నూతన కార్యవర్గ సభ్యులను కలెక్టర్ అభినందించారు.

## సిరిసిల్ల టౌన్ సీఐగా రఘుపతి

సీఐ రఘుపతి

తెలంగాణ చౌక్/సిరిసిల్ల టౌన్, జనవరి 17: సిరిసిల్ల పట్టణ సీఐగా బీ రఘుపతి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు ఇక్కడ విధులు నిర్వర్తించిన టౌన్ సీఐ బీ ఉపేందర్ ఐజీ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. కాగా జిల్లా డీసీఆర్‌బీలో విధులు నిర్వర్తించిన బీ రఘుపతి టౌన్ సీఐగా నియమాకమయ్యారు. కాగా, సీఐని సిరిసిల్ల ప్రెస్ క్లబ్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. వేములవాడ రాజన్న చిత్రపటం, ప్రసాదం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఇక్కడ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ఆకుల జయంత్‌కుమార్, సీనియర్ పాత్రికేయుడు తడుక విశ్వనాథం, తదితరులు ఉన్నారు.

## ఎస్ఐల బదిలీలు

తెలంగాణ చౌక్, జనవరి 17: జిల్లాలో పలువురు ఎస్ఐలను బదిలీ చేస్తూ ఎస్పీ అఖిల్ మహాజన్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా స్పెషల్ బ్రాంచ్‌లో (డీఎస్‌బీ) విధులు నిర్వర్తిస్తున్న ఎల్ శ్రీకాంత్‌ను బోయినపల్లికి, కే ప్రశాంత్‌రెడ్డిని తంగళ్లపల్లికి, జే రమేశ్‌ను వేములవాడ టౌన్ పీఎస్ నుంచి వీర్నపల్లికి, ఎస్ అశోక్‌ను చందుర్తి పీఎస్ నుంచి రుద్రంగికి, వీ వెంకటేశ్వర్లను తంగళ్లపల్లి పీఎస్ నుంచి చందుర్తి పీఎస్‌కు, డీ నవత వీర్నపల్లి పీఎస్, బీ మహేశ్ గంభీరావుపేట పీఎస్ నుంచి డీఎస్‌బీకి బదిలీ చేశారు. ఎం మహేందర్‌ను బోయినపల్లి పీఎస్, కే రాజేశ్‌ను రుద్రంగి పీఎస్ నుంచి సరెండర్ చేస్తూ డీఐజీ ఆఫీస్‌కు అటాచ్డ్ చేశారు. కాగా బీ రామ్మోహన్ సిద్దిపేట కమిషనరేట్ నుంచి గంభీరావుపేట పీఎస్‌కు బదిలీపై వచ్చారు.

# వేములవాడను గొప్ప క్షేత్రంగా తీర్చిదిద్దుతాం

- త్వరలోనే వీటీడీఏ సమావేశం నిర్వహిస్తాం
- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కోదండరామ్‌ను కలిసి సన్మానిస్తున్న పలు సంఘాల నాయకులు

వేములవాడ, జనవరి 17: వేములవాడను గొప్ప క్షేత్రంగా తీర్చిదిద్దుతామని, త్వరలోనే సీఎంను కలిసి వీటీడీఏ సమావేశం నిర్వహిస్తామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని మహాలింగేశ్వర ఫంక్షన్‌హాల్‌లో పౌర సన్మానానికి ఆయన హాజరై, మాట్లాడారు. రాజన్న గుడిచెరువు, మూ లవాగు మురికి నీటితో దుర్గంధం వెదజల్లుతోందని, త్వరలోనే ఈ రెండింటినీ ప్రక్షాళన చేస్తామన్నారు. వేములవాడలో ప్రతి అభివృద్ధి ప్రజల భాగస్వామ్యంతోనే జరుగుతుందని చెప్పారు. తెలంగాణ జన సమితి అధ్యక్షుడు కోదండరాం మాట్లాడుతూ, ప్రజలు స్వేచ్ఛ, ఆత్మగౌరవాన్ని కోరుకుంటున్నారని తెలిపారు. అనంతరం ఆది శ్రీనివాస్, కోదండరామును వారు సన్మానించారు. ఇక్కడ నేరెళ్ల తిరుమలగౌడ్, బుస్స దశరథం, పంజాల వెంకటేశ్వర్‌గౌడ్, నూగూరి ప్రకాశం, సత్యనారాయణ, బొజ్జ కనకయ్య, రమేశ్, సకినాల అమర్, నామాల పోశెట్టి, నగుబోత్ రవీందర్, బింగి మహేశ్, బాశెట్టి రవీందర్, తడగొండ సత్తయ్య, హారిక ఉన్నారు.

### పేదలకు మెరుగైన వైద్య సేవలందిస్తాం

కోనరావుపేట, జనవరి 17: నిరుపేదలకు మెరుగైన వైద్య సేవలందిస్తామని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. కోనరావుపేట మండలంలో వట్టిమల్ల గ్రామంలో పల్లె దవాఖానను జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణతో కలిసి ఆయన ప్రారంభించారు. తర్వాత మర్తనపేట, కొలనూర్, ధర్మారం గ్రామాల్లో నిర్వహించిన కృతజ్ఞత ర్యాలీలో పాల్గొన్నారు. ఇక్కడ ఎంపీపీ చంద్రయ్యగౌడ్, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ నర్సయ్య, సర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడు గోపు పరశురాములు, సర్పంచులు కొమ్ము స్వప్న, ప్రమీల, వైద్యాధికారి వేణుమాధవ్, ఉపసర్పంచ్ పుంగం గౌడ్, జిల్లా కిసాన్‌సెల్ అధ్యక్షుడు కేతిరెడ్డి జగన్మోహన్‌రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు ఫిరోజ్ పాషా, దాదె సత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

జాతర ఉత్సవాల్లో రథం వద్ద మాజీ ఎంపీ వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే రసమయి

# కమనీయం.. రామలింగేశ్వరుడి రథోత్సవం

ఇల్లంతకుంట మండలం జంగంరెడ్డిపల్లిలో శ్రీరామలింగేశ్వర స్వామి జాతర ఉత్సవాలు మూడు రోజులుగా కొనసాగుతున్నాయి. వేడుకల్లో భాగంగా బుధవారం రథోత్సవంపై స్వామివారు విహరించగా, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు చేశారు. మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, ఆరెపల్లి మోహన్ ఉత్సవాల్లో పాల్గొని దేవతామూర్తులను దర్శించుకోగా, ఆలయ కమిటీ సభ్యులు వారిని సన్మానించారు. ఇక్కడ జడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, ఎంపీపీ ఊట్కూరి వెంకటరమణారెడ్డి, సెస్ డైరెక్టర్ మల్లుగారి రవీందర్‌రెడ్డి, సర్పంచ్ తూంకుంట శ్రీలత, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

– ఇల్లంతకుంట, జనవరి 17

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

★త్రివేణి హాంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం: 18K. Ph: 9160900024/9640400073.
NT-319415-All

VEHICLE FOR SALE

FOR SALE

★Maruthi Shift Dzire Model: Reg No. TS16ES0004 Contact No. INDUSIND BANK Cell: 9493260274
NTK-316695

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194

# ఆ కార్యదర్శికి డ్యూటీ ఎక్కడ?

- ఎక్కడ పని చేసినా వివాదాస్పదమే
- రెండు నెలల క్రితమే డీపీవో సమగ్ర నివేదిక



తేదీ లేకుండానే నెల మాత్రమే వేసి విధుల్లో చేరాలని కార్యదర్శికి ఇచ్చిన ఉత్తర్వు కాపీ

బోయినపల్లి, జనవరి 17: బోయినపల్లి మండలం మర్లపేటలో ఆరు గ్యారెంటీల దరఖాస్తుల గాయబ్ ఘటనలో కార్యదర్శి లక్ష్మణ్, ఇన్‌చార్జి సెక్రటరీ జనగాం శేఖర్ కొట్టుకున్న విషయం తెలిసిందే. గత మంగళవారం కార్యదర్శుల సమావేశంలో ఇన్‌చార్జి కార్యదర్శికి కార్యదర్శి క్షమాపణ చెప్పారు. అయితే కార్యదర్శి లక్ష్మణ్ ఏ గ్రామంలో పని చేస్తున్నాడో ఎవరికీ తెలియదు. కానీ మండల పరిషత్ అధికారులు మాత్రం మర్లపేట కార్యదర్శిగా పని చేస్తున్నాడని చెబుతున్నారు.

### రెండు నెలల క్రితమే డీపీవో సమగ్ర నివేదిక

మర్లపేట కార్యదర్శి లక్ష్మణ్‌పై ఎంపీవో గంగాతిలక్ రెండు నెలల క్రితమే డీపీవో రవీందర్‌కు సమగ్ర నివేదిక అందించారు. మర్లపేట అభివృద్ధి విషయంలో సహకరించకపోవడంతో పాటు సక్రమంగా విధులకు హాజరుకాలేదని మండల అధికారులు, కలెక్టర్‌కు సర్పంచ్ మూడు నెలల క్రితం ఫిర్యాదు చేశారు. మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ కూడా ఆయనను మర్లపేట నుంచి తొలగించాలని కలెక్టర్‌కు సిఫారసు చేశారు. సర్పంచ్ ఫిర్యాదు మేరకు డీపీవో రవీందర్ విచారణ చేయాలని ఆదేశించారు. కార్యదర్శి ఏ గ్రామంలోనైనా విధుల్లో చేరేందుకు సర్పంచులు ఒప్పుకోవడం లేదని, అతడిని మరో మండలానికి బదిలీ చేయాలని ఎంపీవో సమగ్ర నివేదిక పంపించారు. ఈ తరుణంలో మర్లపేట సర్పంచ్ సుకన్య భర్త శ్రీనివాస్‌తో కార్యదర్శి లక్ష్మణ్ మండల పరిషత్ ఆవరణలో గొడవపడ్డాడు. తర్వాత నెల రోజులపాటు సెలవుల్లో వెళ్లగా, నర్సింగాపూర్ సెక్రటరీ శేఖర్‌కు మర్లపేట ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఇది ఇలా ఉండగా ఆయన డిసెంబర్‌లోనే విధుల్లో చేరి మర్లపేట కార్యదర్శిగా పని చేస్తున్నట్లు తేదీ కూడా లేకుండా ఆయనకు ఉత్తర్వు కాపీ ఇచ్చారు. ఆయన మర్లపేట కార్యదర్శిగా పని చేయకుండానే జీతం ఇస్తున్నారు. పని మాత్రం ఇన్‌చార్జి సెక్రటరీ శేఖర్‌తో చేయిస్తున్నారు.

## చాకలి ఐలమ్మ విగ్రహావిష్కరణ

కోనరావుపేట, జనవరి 17: మర్తనపేటలో చాకలి ఐలమ్మ విగ్రహాన్ని మాజీ జడ్పీటీసీ చెన్నమనేని శ్రీకుమార్ సహకారంతో ఏర్పాటు చేయగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ బుధవారం ఆవిష్కరించారు. చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తిని కొనసాగించాలని, ఆశయాలకు అనుగుణంగా ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. ఇక్కడ సర్పంచ్ వంశీకృష్ణారావు, రజక సంఘం నాయకులు, ఉన్నారు.

## పతంగి ఎగురవేస్తుండగా..

- ప్రమాదవశాత్తు జారిపడి బాలుడికి గాయాలు

బోయినపల్లి, జనవరి 17: పతంగి ఎగురవేస్తుండగా ప్రమాదవశాత్తు జారిపడి ఓ బాలుడు గాయపడిన ఘటన విలాసాగర్‌లో చోటుచేసుకున్నది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. కొంకటి పరశురాం కొడుకు అభి(12) బుధవారం సాయంత్రం వేళలో పతంగి ఎగురవేసేందుకు వారి ఇంటి బంగ్లా ఎక్కాడు. ఈ క్రమంలో పతంగి ఎగురవేస్తుండగా, ప్రమాదవశాత్తు జారి కిందపడగా, గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే వేములవాడలోని ఓ దవాఖానకు తీసుకెళ్లారు.

## నేడు వాహనాలకు వేలం పాట

ఎల్లారెడ్డిపేట, జనవరి 17: గుడుంబా నేరాల్లో పట్టుకున్న వాహనాలకు గురువారం వేలం పాట ఉంటుందని ఎక్సైజ్ సీఐ చంద్రశేఖర్ బుధవారం ప్రకటనలో పేర్కొన్నారు. నాలుగు బైక్‌లు, రెండు ఆటోలకు వేలం వేస్తున్నట్లు చెప్పారు. వేలంలో పాల్గొనేవారు ప్రభు త్వం నిర్ణయించిన ధరలో 50శాతం డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందన్నారు.

# నేరాల నియంత్రణలో భాగస్వాములవ్వాలి

- ఎస్పీ అఖిల్ మహాజన్
- వేములవాడలోని న్యూఅర్బన్ కాలనీ కార్డెన్‌సెర్చ్
- 13 బైక్‌లు, రెండు ఆటోలు సీజ్

న్యూఅర్బన్ కాలనీ ప్రజలతో మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

వేములవాడ, జనవరి17: నేరాల నియంత్రణలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని ఎస్పీ అఖిల్‌మహాజన్ పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని న్యూ అర్బన్ కాలనీలో కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, నేరాల నియంత్రణ కోసమే కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్‌ను ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజల రక్షణ, భద్రత పోలీస్ బాధ్యత అని తెలిపారు. గ్రామాల్లో అపరిచితులు తిరిగితే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని సూచించారు. ఎవరైనా సైబర్ మోసానికి గురయితే వెంటనే 1930 నంబర్‌కి కాల్ చేయాలన్నారు. సరైన పత్రాలు లేకపోవడంతో 13ద్విచక్ర వాహనాలు, రెండు ఆటోలను సీజ్ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ట్రెయినీ ఐపీఎస్ రాహుల్‌రెడ్డి, డీఎస్పీ నాగేంద్రాచారి, సీఐలు కరుణాకర్, కృష్ణకుమార్, కిరణ్‌కుమార్, ఎస్ఐలు మారుతి, గోపాల్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## వస్త్ర పరిశ్రమను ఆదుకోవాలి

- ముఖ్యమంత్రికి లేఖ రాసిన ఎంపీ బండి సంజయ్

కరీంనగర్, జనవరి 17 (నమస్తేతెలంగాణ ప్రతినిధి) : సిరిసిల్ల వస్త్ర పరిశ్రమను ఆదుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేఖ రాసినట్టుగా కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సిరిసిల్ల జిల్లాలో వస్త్ర పరిశ్రమ సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నదని, ఈ రంగంపై ఆధారపడ్డ 20 వేల మంది కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో మొత్తం 33 వేల మరమగ్గాలున్నాయని, అందులో 28 వేల మగ్గాలపై పాలిస్టర్ వస్త్రాలు, 5 వేల మగ్గాలపై కాటన్ వస్త్రాలు తయారవుతున్నాయని పేర్కొన్నారు. ఉత్పత్తి వ్యయం పెరుగడం, పాలిస్టర్ బట్టకు గిట్టుబాటు ధర ఉండకపోవడం, సరైన మార్కెట్ కూడా లేకపోవడంతో సాంచాలను బంద్ పెట్టారని చెప్పారు. తక్షణమే ఆదుకోవాలని ఆయన కోరారు. సిరిసిల్లలో మరమగ్గాలను ఆధునీకరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని, అందుకు అవసరమైన నిధులు కేటాయించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అలాగే సిరిసిల్లలో మెగా పవర్ లూం క్లస్టర్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారని, అందుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం తగిన ప్రతిపాదనలు పంపితే కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి త్వరగా మంజూరు చేసేందుకు కృషి చేస్తానని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# మేం బతికేదెట్లా..?

- కిడ్నీ వ్యాధితో ఇంటి పెద్దదిక్కు కన్నుమూత
- అప్పు తెచ్చి చికిత్స చేయించినా దక్కని ప్రాణం
- దిక్కుతోచనిస్థితిలో నిరుపేద కుటుంబం
- ఇద్దరు చిన్నారులను సాదుడెట్లా.. అని రోదించిన భార్య

ఎల్లారెడ్డిపేట, జనవరి 17: కలోగంజో తాగి ఉన్నంతలో హాయిగా సాగిపోతున్న ఆ కుటుంబంపై విధి చిన్నచూపు చూసింది. కిడ్నీ వ్యాధి రూపంలో ఇంటి పెద్దదిక్కును బలి తీసుకున్నది. 26ఏండ్ల వయసులోనే భర్త కానరానిలోకాలకు వెళ్లిపోవడంతో భార్య కన్నీరు మున్నీరవుతున్నది. 'మూడేండ్ల బిడ్డ, ఐదు నెలల బాబును సాదుడెట్లా.. బతికేదెట్లా..' అంటూ భర్త మృతదేహంపై పడి రోదించిన తీరు ప్రతిఒక్కరి కండ్లను చెమర్చింది. వివరాల్లోకి వెళ్తే.. ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌కు చెందిన అనుప రాజు(26) బుధవారం కిడ్నీ సంబంధిత వ్యాధితో కన్నుమూశాడు. రాజు ఏడేండ్ల క్రితం అప్పులు చేసి బతుకుదెరువు కోసం గల్ఫ్ వెళ్లాడు. అయితే అక్కడ సంపాదన అంతంత మాత్రమే ఉండడంతో రెండేండ్ల క్రితం తిరిగివచ్చి, సమీప బంధువైన శిరీషను పెండ్లి చేసుకున్నాడు. పెండ్లి ఖర్చుల కోసం రూ.3లక్షల దాకా అప్పు చేశాడు. ఈ క్రమంలో ఓ పెట్రోల్ బంకులో పనికి కుదిరాడు. వచ్చిన జీతంతో భార్యాబిడ్డలను పోషించుకుంటున్నాడు. ఉన్నంతలో జీవితం సంతోషంగా సాగిపోతున్న సమయంలో వారం క్రితం అస్వస్థతకు గురయ్యాడు. దవాఖానకు వెళ్లగా పరీక్షలు చేసిన వైద్యులు గుండె సంబంధ వ్యాధితోపాటు కిడ్నీలు ఫెయిలైనట్లు నిర్ధారించారు. చికిత్సకు రూ.3లక్షల వరకు ఖర్చవుతుందని చెప్పారు. దీంతో చేతిలో చిల్లిగవ్వలేని కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. అయినా కొంత మొత్తం అప్పు తెచ్చి ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. బుధవారం తెల్లవారుజామున పరిస్థితి విషమించి రాజు మరణించాడు. అప్పటి వరకు కష్టమంటే తెలియని భార్య శిరీష.. ఓ వైపు అప్పులు, మరో వైపు చిన్నారుల పోషణను తలుచుకుని 'బతికేదెట్లా దేవుడా'.. అంటూ బోరున విలపించింది. కుటుంబాన్ని ప్రభుత్వపరంగా ఆదుకోవాలని, దాతలు ఆపన్నహస్తం అందించాలని రాజు తల్లిదండ్రులు అనుప చిన్నమల్లయ్య, పోశవ్వ వేడుకున్నారు.

### దాతలు సాయం చేయాలి..

బాధిత కుటుంబానికి దాతలు సాయం చేయాలని గ్రామస్తులు కోరారు. ది కరీంనగర్ డిస్ట్రిక్ట్ కోఆపరేటివ్ బ్యాంకుకు (